కర్ణామృతం

ఏమండీ, కర్ణామృతమన్న మాట అందరూ విన్నదేకదా! ఏమిటది? వేణునాదమా? వీణాగానమా? కలకంఠి కూజితమా? కాదు. వీటికి మించింది మరొకటి వుంది. అదేమిటో? తొందరపడకండి సార్! మనవి చేస్తున్నా.

'ఉడుముకేలరా ఊళ్ళో పెత్తనం అంటారు. నిజమే! ఊళ్ళోకి వచ్చేస్తే... ఎక్కడ దాక్కోవాలి? ఏం తినాలి? ఏ విధంగా బయటపడాలి? ఇలా అన్నీ చిక్కులే దానికి! చిన్నాజీ పరిస్థితికూడా ఇంచుమించు అలాగే అయిపోయింది. అతడు పుట్టి పెరిగింది... అడవిలో పల్లె. మనిషిన్నీ అడివిపువ్వులాంటివాడే! అయిదు మైళ్ళ దూరంలోని పేటకొండలో వున్న... చిన్న హైస్కూల్లో చేరడంతో ఆ అడవిపువ్వు గాలికి కొట్టుకొచ్చి నాగరికతా ప్రభంజనంలో పడిపోయినట్టయిపోయింది.

పులిమీద పుట్రలా... ముగ్గురు కూతుళ్ళున్న మేనమామ ఒకతను... కనీసం ఒక్క కూతురినైనా చౌకబేరంతో సాగనంపాలనుకోడం... చిన్నాజీ పాలిటికి పెద్ద కుట్రైపోయింది. ఆ మేనమామ అతణ్ణి తీసుకెళ్ళి ఇంటరులో చేర్పించాడు. అందులో గట్టెక్కగానే "చాల్లేరా అబ్బాయ్! ఎక్కువగా చదివితే అజీర్ణమే గదా! వుండు, నిన్ను నేను ప్రయోజకుణ్ణిగా చేస్తానం"టూ బెంగుళూరు తీసుకెళ్ళి ఫ్రూట్ టెక్నాలజీలో డిప్లొమా చేయించాడు. ఆ కోర్సు పూర్తికాగానే మేనమామ కూతురికన్నా ముందుగా ఉద్యోగమే అతణ్ణి వలచివచ్చింది.

ఫలవృక్షాల కేంద్రం కోడూరులో "పినాకినీ ఫ్రూట్ క్యానింగ్ ఇండస్ట్రీస్"లో టెక్నీషియన్‌గా చేరిపోయాడు.

జూన్‌తో అయిదు సంవత్సరాల కోర్సు పూర్తయింది.

ఎం.డిగారి దగ్గరనుంచి కబురొచ్చిందంటే... "ఏమైందో ఏంపాడో! ఏం గతిరా దేవుడా" అనుకుంటూ బెంబేలు పడిపోయాడు. తీరా వెళ్ళి కలిశాక భయపడాల్సిన విషయమేమీ కాదని తెలిసింది. "చూడవయ్యా చిన్నాజీ! నువ్వు నాకు నచ్చావు. మన ఇండస్ట్రీకి ఒక అమూల్యాభరణంగా కుదిరిపోయావు. నీకు మంచి భవిష్యత్తు వుంటుందని నా నమ్మకం. ఫ్రూట్ టెక్నాలజీలో కొత్త కొత్త పద్ధతులు కనిపెట్టడంలో ఆరితేరిపోయిన దేశం ఒకటుంది. మూడు నెలల 'రిఫ్రెష్‌మెంట్' కోర్సు నిమిత్తం నిన్నక్కడికి పంపిస్తున్నాము. ఇండియానుంచి వెళ్తున్న అయిదుగురు డెలిగేట్స్‌లో నువ్వొకడివి" అన్నారు ఎం.డి.గారు. చిన్నాజీ ఆనంద సంభ్రమాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరైపోయాడు. 'అడివిలో పల్లె' ఎక్కడ? ఆస్ట్రేలియా ఎక్కడ? చిన్నాజీకి విదేశీ ప్రయాణం అలా ఒనగూడింది.

కొత్త దేశం ఎలా వుంది? తిండి తిప్పలేమిటి? ఎదురైన పరిస్థితులేమిటి? స్వదేశానికి వెళ్ళాక... ఎవరైనా అడిగితే చెప్పాలిగదా! విశేష సంఘటనలను గురించి విలక్షణ సన్నివేశాలను గురించి రాసి పెట్టదలచుకున్నాడు చిన్నాజీ. వెళ్ళినరోజు రాత్రి పడుకోడానికి ముందుగా ఆ పనికి శ్రీకారం చుట్టాడు.

ఆగస్టు 7 : మదరాసు నుంచి బయల్దేరి... మలేషియా... క్వీన్‌లాండ్‌ను చుట్టుకుని... మా విమానం సిడ్నీలో నేలను తాకేసరికి... భళ్ళున తెల్లవారింది. రాత్రంతా సరిగ్గా నిద్రలేదనే చెప్పాలి. మూడు సీట్ల వరుసలో... నా పక్కన ఆంగ్ల దంపతులెవరో కూర్చున్నారు. వాళ్ళు మాట్లాడుతుంటే పచ్చి కొబ్బరాకుతో పీకలు తయారుచేసి 'పీ, పీ' అంటూ ఊదినట్టే వుంది. వెనుకవైపు సీట్లను మలేషియా ముస్లింలు ఆక్రమించారు. వాళ్ళ పలుకుబడిలో అనునాసికాల రొద చెప్పతరం గాదు. ముక్కు మూసిపెడితే, నాలుకపైనుంచి ఒక్క పదమైనా ఊడిపడేటట్టు తోచదు. ముందు వరుసలో కూచున్న ఫిలిప్పైన్స్ బౌద్ధులు, ఎన్నో కొన్ని శతాబ్దాల కిందట జనవ్యవహారం నుంచీ మాయమైపోయిన ఓ పాత భాషను, పునరుద్ధరణ చేయడం కోసం... సాధన చేస్తున్నట్టున్నారు. వివిధ లోహాల పాత్రల్లో గులకరాళ్ళు వేసి గిలకరించినట్టుందని చెప్పుకోవచ్చు. అంతేగానీ వాళ్ళు మాట్లాడుకుంటున్నారని చెప్పుకోవడానికి మనసొప్పడంలేదు. ఎట్లాగో అర్ధరాత్రి తరువాతెప్పుడో మగత నిద్రపట్టింది. సిడ్నీలో దిగేసరికి కింద భూమి, పైన ఆకాశం, చుట్టూరా దిక్కులు తప్పితే పరిచితమైనవేవీ కనిపించలేదు. ఏరోడ్రోమ్‌లో నుంచి బయటపడటంకోసం దూసుకెళ్తున్న జనసందోహంలో కానవచ్చిన జీవనోత్సాహమే నన్ను ముందుకు నెట్టుకుంటూ వెళ్ళింది. ఎగ్జిట్ ద్వారానికింక పది బారల దూరం వుండనగా ఒక బ్యానర్‌పైన "ముర్రేఫ్రూట్ క్యానింగ్ అండ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్, గ్రీన్ వ్యాలీ డౌన్స్" అన్న పేరు కనిపించేదాకా మనసులో దిగులు దిగులుగానే వుండిపోయింది. బ్యానర్ దగ్గర నుంచి ఈవలికి వచ్చిన వ్యక్తులిద్దరు "ఆర్ యూ ఎన్ ఇండియన్? యువర్ నేమ్ ప్లీజ్?" అని పలకరించారు. ఏం చెప్పాలో తటాలున తోచక "యస్ యస్ ఐయామ్ చిన్నాజీ!" అన్నాను. 'ఇంతటితో నీ పని క్లోజ్ ఇక మా పని ప్రారంభం' అన్నట్టుగా వాళ్ళు చెరొక వైపునుంచీ పట్టుకుని, నన్ను తీసుకెళ్ళి వ్యానులో పడేశారు. ఇంకా నగరం సరిగ్గా మేలుకోలేదు. భవనాలు, సౌధాలు, ప్రాసాదాలు అని చెప్పుకోదగ్గ జనావాసాల మధ్యనుంచి విశాలమైన రోడ్లగుండా వాహనం పరుగిడుతోంది. శివార్లు దాటేటప్పటికి రెండు గంటలు పట్టింది. ఆ పైన దిక్కుల చివర్ల ద్వారా వ్యాపించిన గోధుమ పొలాల గుండా మూడు గంటల ప్రయాణం. అక్కడినుంచి ఘాటురోడ్డు మొదలు. ఎక్కి దిగేటప్పటికి కొత్త లోకాలలోకి ప్రవేశిస్తున్నట్లు పచ్చగా ఒక లోయ కానవచ్చింది. బహుశా 'గ్రీన్ వ్యాలీ' అంటే ఇదేనేమో! దృశ్యాలు కనుల నిండుగా వున్న మాట నిజమేగానీ, నన్ను రిసీవు చేసుకున్న యువకులు 'బీర్ క్యాన్' ఒకటి తెరచి పట్టుకుని, ఆన్‌చేసిన టేపు రికార్డరులో – కాళ్ళకు గజ్జలు కట్టుకొన్న అస్థిపంజరాలు కొన్ని సల్పుతున్నట్టున్న వికట నాట్యానికి అనుగుణ్యంగా... భూతాలు పాడుతున్నాయి. ఉండివుండి ఉన్మాదులెవరో ముక్తాయింపులు గుప్పిస్తున్నారు. నాయనా, చెవిలో శూలాలు దిగేయడమంటే ఇదేనేమో! శిక్షణాలయం చేరుకునేసరికి గంట పన్నెండు దాటింది. స్నానంచేసి దుస్తులు మార్చుకుని డైనింగ్ హాల్లోకి వెళ్ళాను. ప్రపంచమంతటి నుంచీ వచ్చిన అరవైమంది డెలిగేట్లు మాటల్ని తూటాల్లా విసురుతూ, తినుబండారాల్ని ఉండ్రాళ్ళకు మల్లే నోట్లోకి గిరాటు కొడుతున్నారు. భారతదేశపు డెలిగేట్లు నలుగురూ భోజనం కాగానే డైనింగ్ హాల్లోనే నన్ను సంధించేశారు.

వరండాలోకి తీసుకెళ్ళి పరామర్శించడానికి ప్రయత్నించారు. వాళ్ళల్లో శ్రావణ్ ముఖర్జీ, బలభద్రపాత్రోలకు బెంగాలీ, ఒరియాల్లో తప్పితే ఇంగ్లీషులో నాలాగే అంతంత మాత్రం పరిజ్ఞానం మాత్రం వున్నట్టు గ్రహించాను. మిగిలిన ఇద్దరూ ఉత్తరప్రదేశ్ నుంచీ వచ్చారు. వీళ్ళకు హిందీ కొట్టిన పిండి.

"ఆప్ కా శుభ్‌నామ్? ఆప్ కహాసే ఆయే హై? కహా నౌకరీ కర్‌తే హై? ఆప్ కీ తరఫ్ క్యాక్యాఫల్ మిల్‌తేహై?" అంటూ ప్రశ్నలు రువ్వి చూశారు. చివరకు ఆశాభంగానికి గురైపోయి... పొసగని భార్యకు విడాకులిచ్చేసిన భర్తలకు మల్లే వాళ్ళ గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. ఒక్కొక్కరికి ఒక గది కేటాయించడం నా పాలిట పెద్ద వరమైపోయింది. చివరగా ఓ మాట చెప్పాలి. ఈరోజు జీవితంలో చూచి ఎరుగని ప్రదేశాలు చూచాను. పరమ రమణీయమైన ప్రకృతి విలాసాలను దర్శించాను. నిజానికెంతో ఆనందంగా వుండాల్సింది. కాని ఎందుకో, ఏమిటో ఉత్సాహంగా లేదు. ఏదో పోగొట్టుకున్నట్టుంది. ఏమిటది? ఏమైవుంటుంది?

ఆగస్టు 29 : పోయిన వారాంతంలో మమ్మల్ని తోటలకు ప్రసిద్ధి చెందిన ముర్రే పరివాహక ప్రాంతాలకు తీసుకెళ్ళారు. ఆఫ్రికా పీచ్, పియర్, యాపిల్, ద్రాక్ష... ఇంకా ఎన్నో రకాలు... గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతుంటే... ఎంత ముద్దొస్తున్నాయో! తోటల మధ్య ఓ హోటల్లో వెన్నతో మిళాయించిన ఫ్రూట్ సలాడ్ పెట్టించారు. 'శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ' అన్నారు పోతన్నగారు. నన్నడిగితే ఆ ఫ్రూట్ సలాడ్‌ను రుచి చూచిన జిహ్వే జిహ్వంటాను. ఎడారులు భగవంతుడి ఆగ్రహానికి గురయితే, పండ్ల తోటలు ఆయన అనుగ్రహానికి గుర్తు అనుకున్నాను. బాగానే వుంది. కానీ మనసులో ఏదో వెలితిగానే వుందే! చేజారిపోయిందేదో దొరికి నట్టేలేదే! ఏమిటది? ఏమైవుంటుంది.

సెప్టెంబర్ 15 : ముర్రే నదికి ఉపనది 'రాడ్లింగ్'. దానిపైన అపురూప దృశ్యమేదో కానవస్తుందన్నారు. రెండువందల కిలోమీటర్ల బస్సు ప్రయాణం. ఎత్తయిన కొండపేటు నుంచి దూకే జలపాతం, 'సిల్వర్ ఫాల్స్' అంటారట! ఫాల్స్ మాటకేంగాని దానికొక ఫర్లాంగ్ దూరంలో నదికడ్డంగా ఒక వంతెన నిర్మించారు. ఆ వంతెనపైన నిల్చుంటే ఎదురుగా జలపాతం. పైన ఆకాశం, క్రింద ప్రవాహం, చుట్టూరా నిమ్నోన్నతాలకు ఆచ్ఛాదనగా పచ్చని ప్రకృతి. ఆ మనోహర దృశ్యాన్ని ఎంతసేపు చూసినా తనివితీరదు. కళ్ళు తరించినట్టయింది. తిరిగి వచ్చాక కూచున్నా, పడుకున్నా, కళ్ళు మూసినా, తెరిచినా ఆ దృశ్యమే మనో నేత్రాల్లో తాండవిస్తోంది. అయినా మళ్ళీ ఏదో గుబులు. స్వదేశంలో వుండగా అనుభవానికి వచ్చింది గాదు. ఎందుకీ విషాదం? ఎందుకిలా మనసును తొలిచేస్తోంది? ఆలోచించాను, ఆలోచించాను.

స్ఫురించదే! ఏమిటది? ఏమై వుంటుందది?

అక్టోబర్ 22 : ఈరోజు ఆదివారం. రాత్రివేళ. పది గంటలయింది. నా ఆస్ట్రేలియా మకాంలో యిది మరపురాని రోజనుకోవాలి. దాదాపుగా ఖండానికంతా కేంద్ర స్థానంగా వున్న ఓ టూరింగ్ స్పాట్‌కు మమ్మల్ని విమానంపైన తీసుకెళ్ళారు. స్వదేశానికి వెళ్ళడానికున్న వ్యవధి కొద్దిరోజులే గదా! మేమందరమూ షాపింగ్ సెంటర్లోకి జొరబడ్డాము. మధ్యాహ్న

భోజనానంతరం ఓ మ్యూజియం దర్శించాము. ఓ 'జూ' అంతటా కలయతిరిగాము. గంట నాలుగయింది. అయిదింటికల్లా తిరుగు ప్రయాణంకోసం విమానాశ్రయంలో వుండాలి. మృగశాలనుంచీ ఈవలికొచ్చేసరికి ఓ గుట్టపైన తెల్లటి కట్టడం ఒకటి కనిపించింది. గోపురం, మండపం, ధ్వజస్తంభం, ఏమిటది? గుడికాదు కదా! మా యింగితాన్ని గ్రహించినట్టుగా "ఎస్, దటీజ్ ఏ టెంపుల్! యు మే గో అండ్ సీ యిట్! బట్ యూ షుడ్ రిటర్న్ ఇన్ 15 మినిట్స్" అన్నాడు గైడు. వంద మెట్లున్నాయేమో, గబగబా ఎక్కిపోతున్నాను. స్వదేశీ నేస్తాలు నలుగురితోపాటు మరికొందరు విదేశీ డెలిగేట్లు కూడా నావెంట వస్తున్నారు. పంచ పైన బనీను తొడుక్కొని భుజాలపైన్నుంచీ అంగవస్త్రం వేసుకున్న ఓ కుర్రస్వామి మంత్రాలు చదువుకుంటూ మండపంలో కానవచ్చాడు. గర్భగుడిలో నుంచీ పుష్పమాలాంకృతుడైన 'బాలాజీ' దర్శనమిచ్చారు. ఒళ్ళు మైమరచిపోయి 'మీరు తెలుగువాళ్ళా స్వామీ?' అన్నాను. "మీరు ఆంధ్రానుంచీ వస్తిరా? మాది తిరుపతి, మీవూరు?" అన్నాడు కుర్రస్వామి.

"పాకాల, దామల్ చెరువు, వల్లివేడు... ఆ పేర్లు విన్నారా? ఆ ప్రాంతంలోనే మావూరు, 'అడవిలో పల్లె'. చాలా దూర దేశం వచ్చేసినట్టనుకున్నా! ఇక్కడ ఈ గుడి, ఈ దేవుడి కైంకర్యంలో మీరు – ఇదంతా చూశాక మా అడవిలో పల్లెకు, ఆస్ట్రేలియాకు అట్టే దూరం లేదనిపించింది.

తిరుపతిలో మీ ఇల్లెక్కడ స్వామీ?"

"దిగువ తిరుపతిలో... గోవిందరాజస్వామి గుడిదగ్గర... దక్షిణ మాడవీధి తెలుసునా? అక్కడ్నే మా ఇల్లు. నా పేరు పి.బి.వరదాచారి"

"పి.బి. అంటే? ప్రతివాది భయంకర, కాదుగదా?"

"అదే మా యింటి పేరు. మీకెలా తెలుసు?"

దేవుణ్ణి దర్శించుకొని వెళ్ళి మెట్లపైన కూచున్న తోటి శిక్షణార్థులు "ప్లీజ్, చిన్నాజీ! టైమ్ ఈజ్ ఓవర్! హరీఅప్" అని గొడవ చేస్తున్నాడు.

నేను పట్టించుకోలేదు. "నాకెలా తెలుసునంటారా స్వామీ! ఇంటరులో మా తెలుగు లెక్చరర్ ప్రతివాది భయంకర భావనాచారిగారు, పి.బి.బి అనేవాళ్ళు. మేం మాత్రం, 'పిల్లల్ని భయపెట్టే భల్లూకం' అనుకునే వాళ్ళం. పాపం శమించుగాక! చెంపలేసుకుంటున్నాను. నాకు తెలుగులో నాలుగు ముక్కలొచ్చాయంటే అదంతా ఆ మహానుభావుడు పెట్టిన భిక్ష." "చిన్నాజీ! వుయ్ డోంట్ బాదర్ అబవుట్ యూ! గోయింగ్ అవే ఫ్రమ్ దిస్ ప్లేస్! యు మే స్టే హియర్..." అల్టిమేటం జారీచేసి మిత్రులు కొండ దిగిపోతున్నారు.

"ఆ ప్రతివాది భయంకర భావనాచారిగారు మా పెదనాన్నగారే! నేనాయన తమ్ముడి కుమారుణ్ణి".

"అట్లాగా స్వామీ! మా భావనాచారి మేష్టరుగారు బాగున్నారా? ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? వారి తమ్ముడి కుమారుడైన మిమ్మల్ని, ఈ దేశంలో చూడగలగడం – ఎంత అదృష్టం?"

"చిన్నాజీ! ఇట్‌ఈజ్ ఆల్‌రెడీ లేట్! యూ ఆర్ వార్న్డ్ టు కమ్‌హియర్ ఎట్‌వన్స్" మెగా ఫోనులోంచీ గైడు గొంతు చించుకుంటున్నాడు.

"స్వామీ! ఓ మంగళహారతి యిప్పించరూ?"

"అంతకంటేనా. యిదిగో... మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాత్మనే, చక్రవర్తి తనూజాయా, సార్వభౌమాయ మంగళం. పుంస్త్వాం మోహనరూపాయ, మేఘశ్యామల మూర్తయే."

"సెలవుస్వామీ! నమస్కారం, వెళ్ళొస్తా! జ్ఞాపకముంచుకుంటారు గదూ! నా పేరు చిన్నాజీ. ఊరు అడవిలోపల్లె. తిరుపతి దగ్గరే..."

తిరిగొచ్చాక గదిలో కూచుని రాస్తున్నాను. గంట పదయింది. మంగళాకారుడైన స్వామి మంగళహారతి వెలుగుల్లో కనిపిస్తూనే వున్నాడు. మెట్లు దిగుతుండగా గుడిలో గంట మ్రోగడం వినిపిస్తూనే వుంది. శరత్కాలపు పండు వెన్నెలలు పరవళ్ళు దొక్కినట్టుగా నా మనసంతటా ఆనందమే విరిసిపోయింది. ఎందుకో చెప్పనా? చాలారోజుల తర్వాత నేను... మధురంగా, మార్దవంగా, మంజులంగా, మోహనంగా నా తల్లి పలుకు విన్నాను...

మీరూ విన్నారు గదండీ! వేణునాదానికి, వీణా గానానికి కలకంఠి కూజితానికి మించి వీనుల విందైనదేమిటో తెలిసిపోయింది గదా! నమస్కారం!!

❖ ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధం - 11 ఏప్రిల్, 1999. ❖